# భూమిగుండం



క్షరణంగారు నన్ను గుర్తించలేదు.

"ఎవరూ?" అన్నారాయన.

"నేనండీ మాధవరావును" అన్నాను.

ఆయన చేతిలో లాంతరు వెలుగు నా ముఖంమీద పడటంతో ఆయన నన్ను ఒక నిముషం పరిశీలనగా చూసి గుర్తించి "నువ్వా మాధవరావ్..........ఎవరో అనుకున్నాను. రావోయ్! రా!" అన్నారు




నవ్వుతూ. సరిగ్గా పది పదిహేనేళ్ళ యింది నేనా ఊర్కు వదిలి.

"చాలా ఏళ్ళ తర్వాత వచ్చావ్. అందరూ బాగున్నారా?" అడిగా రాయన.

"ఇక్కడికి నాలుగు మైళ్ళ దూరంలో ఉన్న వూరికి పనిమీద వచ్చాను. ఎట్లాగూ ఇంత దూరం వచ్చాను కదా, మీ అందర్నీ చూసి పోదామని వచ్చాను. నాకు ఎన్నాళ్ళ

నించో మిమ్మల్నందరినీ చూడాలనే కోరికగా ఉంది. ఈ రోజుకు రాగలి గాను'' అన్నాను.

"అయితే మమ్మల్ని మరచి పోలేదన్న మాట'' అన్నారు.

మే మిద్దరం మాట్లాడుతూ వుండంగా లోపల్నించి కరణంగారి భార్య బయటకు వచ్చింది. ఆమెను నేను సులభంగానే గుర్తించాను. నా దగ్గరకు రాగానే "నమస్కారమండీ'' అన్నాను చేతులు జోడించి.

"నువ్వా నాయనా కులాసానా!'' అన్నదామె ఎంతో ఆప్యాయంగా.

"మీ దయవల్ల కులాసాయేనండీ''

నాకు ఆ వూళ్లో బాగా పరిచయ ముంది కరణంగారికుటుంబంతోనే. పదిహేనేళ్ళక్రితం నేను ఆ వూరి ఎలిమెంటరీ స్కూలుకు మేష్టరుగా వచ్చాను. ఆ వూరు వచ్చిన కొత్తల్లో నాకు ఉండటానికి ఇల్లూ, ఇతర సదుపాయాలూ సమకూర్చింది కరణంగారే... నేనంటే ఆయనకూ ఆయన భార్యకూ ఎంతో ప్రేమ.

"బాబూ! చాలా పొద్దుపోయింది. కాళ్ళుకడుక్కో భోంచేద్దువుగాని!'' అన్నదామె.

భోజనం చేస్తున్నంత సేపూ తమకుటుంబ విషయాల గురించి చెప్పారు కరణంగారు, ఆయన పెద్దకూతురికి నాలుగేళ్ళక్రితం పెళ్ళి చేశారుట. ఆ అమ్మాయి నాకు బాగా తెలుసు. నా దగ్గరే చదువుకుంది. కొడుకుల గురించి కూడా చెప్పా రాయన. ఒకతను విజయవాడలో ఏదో ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడుట. మరొకనికి వైజాగ్‌లో ఉద్యోగమట.

భోజనాలైనాయి. పడుకోటానికి ఆరుబయట మంచం వేశారు.

పౌర్ణమి రోజులు కావటంవల్ల చంద్రుడు నిండుగా వున్నాడు.

చంద్రుడికేసి, చుక్కలకేసి చూస్తున్న నాలో పాత స్మృతులు కదిలాయి. ఉన్నట్టుండి ప్రమీల రూపం కనులముందు కదిలింది. ప్రమీల గుర్తుకు రావటంతోనే నా హృదయం ఒక్కసారిగా స్పందించింది. అసలు నేను ఆ వూరికి రావటానికి ముఖ్య కారణం ప్రమీల.

ప్రమీల రోజూ నాకు పాలు పోయటానికి నేనుండే గదికివచ్చేది. అంతేకాదు, అంట్లు తోమటం, చెరువునించి నీళ్ళు తీసుకురావటం లాంటి పనులు కూడా చేసేది. మొదటి చూపులోనే ప్రమీల రూపు నన్ను ఆకర్షించింది. నా మనసును ఆకట్టుకుంది. పున్నమినాటి జాబిలిలా అందంగా వుండేది. విశాలమైన కనులు, నునుపైన చెక్కిళ్లు.... పొడుగ్గా, ఆరోగ్యంగా వుండేది

ప్రమీల. ఆమెను పాలుపోయటానికి, ఇంటిపనులు చేసిపెట్టటానికి కరణం గారే కుదిర్చి పెట్టారు అప్పట్లో.

ఉదయమే అన్ని పనులు చేసుకుపోయేది ప్రమీల. ఆమె ప్రతి కదలికలోనూ ఏవో కొత్త అందాలు కనిపించేవి. ఆమెను ఎంతో పరిశీలనగా గమనించేవాడిని. నేనలా తనని అణువణువూ పరిశీలించటం గమనించి సిగ్గుపడేది ప్రమీల. ముసిముసిగా నవ్వుకునేది. రోజులు గడుస్తున్న కొద్దీ ప్రమీలంటే ఇష్టం కలగటం ఎక్కువయింది. ఆమెను చూడకుండా ఉండలేకపోయే స్థితి కొచ్చాను. ఏ రోజైనా ప్రమీల ఇటుకిరాకపోతే పిచ్చెక్కిన వాడిలా ఇంట్లోకీ, బయటకీ తిరిగే వాడిని. ఆమెను చూసిన తర్వాత గానీ తృప్తి పొందేవాడిని కాదు. ఎప్పుడో ఒకసారి రెండు రోజులు ప్రమీల రాలేదు. జ్వరం వచ్చిందిట. ఆ రెండు రోజులూ నా మనసు మనసులో లేదు. ప్రమీల ఇంటికి వెడదామనుకున్నాను. కాని బావుండదని, ఎవరైనా చూస్తే ఏమైనా అనుకుంటారని నిగ్రహించుకున్నాను. ఆ రెండు రోజులూ క్లాసులో పిల్లలకు పాఠాలు సరిగా చెప్పలేదు. వారిమీద విసుక్కున్నాను. తర్వాత వచ్చింది ప్రమీల. చెప్పలేనంత సంతోషం కలిగింది. ఆ రెండు రోజులూ నేనెంత నరకం అనుభవించిందీ, తనని చూడాలని ఎంత తాపత్రయ పడిందీ ప్రమీలతో చెప్పాను. నవ్వింది.

ప్రమీలకు నేనంటే ఎంతో అభిమానం, గౌరవం, ప్రేమవున్నాయి. ఆమె చూసే ప్రతి చూపులోనూ, ఆమె పలికే ప్రతి మాటలోనూ ఆ భావాలు వ్యక్తమయేవి.

ఆ రోజు ఆదివారం. గదిలో ఒంటరిగా కూర్చున్నాను. బయట వాన కురుస్తోంది. చలిచలిగా వుంది వాతావరణం. కిటికీ తలుపులను మూసివచ్చి సిగరెట్ వెలిగించాను. తెరిచివున్న ద్వారంగుండా బయటకు చూస్తున్నాను. చూస్తుండగానే గబగబా పరిగెత్తుకుంటూ లోపలకు వచ్చింది ప్రమీల. ముద్దముద్దగా తడిసిపోయింది. తడిసిన జాకెట్టు, పరికిణీ, ఓణీ వంటికి అతుక్కుపోయాయి. తడిసిన ప్రమీల శరీరపు వంపులను చూస్తూ నన్ను నేను మరచిపోయాను. కుందనపు బొమ్మలా వుంది ప్రమీల. గుమ్మందగ్గరే విల్చుని వంగి తడిసిన పరికిణీ అంచులను పిండుకుంటోంది. ఆ దృశ్యం చూస్తున్న నాలో కోరిక రేగింది. ఎన్నాళ్ళనించో నాలో అణిగి ఉన్న

కోరిక ఆనాటి ప్రకృతి ప్రభావానికి లోనై పడగ విప్పింది. ఆ క్షణంలో మంచీ, చెడుల విచక్షణ మరచి పోయాను. రానురాను వర్షం మరీ పెద్దదయింది. తెరచివున్న తలుపుల మధ్యనించి జల్లు గదిలోకి కొడు తోంది. నెమ్మదిగా లేచి వెళ్ళి తలుపులను మూసి వచ్చాను. టవలు తీసుకొచ్చి ప్రమీలకు ఇచ్చాను. నల్లని నున్నటి శరీరం మీదనించి నీటిబొట్లు ముత్యాల్లారాలుతున్నాయి తల, శరీరం తుడుచుకొని మౌనంగా నిల్చుంది ప్రమీల. ఆమె పెదవులు వణుకుతున్నాయి. చలికి ఆమె శరీరం కంపిస్తోంది. ఆమె లోని అణువణువూ వేడికోసం తపించిపోతుందని ఆమె కనుల కేసి చూడగానే తెలిసిపోయింది. ప్రమీలకూడా నే నున్న స్థితిలోనే ఉందని సులభంగా అర్థం చేసుకున్నాను. ప్రమీల ఉద్దేశ్యం అర్థమైనతర్వాత నాలో కోరిక మరింత బలపడింది.

మౌనంగా వెళ్ళి నిల్చున్న ప్రమీలను నా కౌగిలిలోకి తీసుకొని, గుండెలకు అదుముకున్నాను.

ఆ తర్వాత ప్రమీల, నేను మరి కొన్నిసార్లు కలుసుకున్నాము. ప్రమీల నాకు మరింత చేరువైంది. మా ఇద్దరి గురించి ఆ ఊళ్లో ఎవరికైనా తెలుస్తుందేమో, ఆమె నాకు దూరమవుతుందేమోనని ఎంతగానో భయపడ్డాను. నేను భయపడ్డట్టు ఏమీ జరగలేదు కాని, మరోరకంగా నేను వూహించనివిధంగా జరిగింది. ఓ రోజు ప్రమీల నా గదికి రాలేదు. ఆ మరు రోజు వచ్చింది. ఆ రోజు ప్రమీల ముఖంలో ఎప్పటి సంతోషం లేదు. విచారంగా ఉంది. ఏమిటని అడిగాను. ఎంతగానో అడిగిన మీదట ఈ విషయం చెప్పింది. షాక్ కొట్టినట్టనిపించింది. ఇంత దూరం వస్తుందని నే నెన్నడూ అనుకోలేదు. భయపడి పోయాను. నిలువెల్లా వణికి పోయాను. ప్రమీలకు నెల తప్పిందట. కాలూ చెయ్యి ఆడలేదు. ప్రమీల జీవితం నాశనం చేశానని నాకు ఆ క్షణంలో అనిపించింది. కాని ఏం చేసేది? జరుగకూడనిది జరిగిపోయింది. ఆమెను పెళ్ళి చేసుకుందామనుకున్నా. నాకు అప్పటికే పెళ్ళయింది. కాని భార్య ఇంకా కాపురానికి రాలేదు. ఏం చెయ్యమంటావని ప్రమీలను అడిగాను. మాట్లాడలేదు. కంట నీరు పెట్టింది. కుమిలి కుమిలి ఏడ్చింది. ప్రమీలకు తల్లి, తండ్రి లేరు. చిన్నతనంలోనే పోయారట. నాయనమ్మ దగ్గర పెరుగుతోంది.

నే నొక గొప్ప ప్రమాదంలో

ఇరుక్కున్నానని తెలిసిన తర్వాత ప్రమీలమీద అంతకు ముందున్న ఆకర్షణ ప్రేమ పోయి ఆమెను చూడగానే భయం కలగటం మొదలు పెట్టింది. కొన్ని రోజుల వరకూ ఈ సమస్యకు పరిష్కారం ఆలోచించి, తల బద్దలు కొట్టు కున్నాను. కాని నాకు ఎటువంటి దారీ దొరకలేదు. అటువంటి పరి స్థితుల్లో తలవని తలంపుగా నాకు ఆ ఊరినించి బదిలీ అయింది. మరు రోజు నేను ఆ వూరినించి వెళ్ళి పోతాననగా ప్రమీల నా గదికి వచ్చి ఏడ్చింది. పట్నం రమ్మని, అబార్షన్ చేయిస్తానని అన్నాను. ప్రమీల అందుకు ఒప్పుకోలేదు. అట్లాగే బ్రతుకు వెళ్ళదీస్తానని వెళ్ళి పోయింది. నే నేమీ మాట్లాడలేక పోయాను. మంచివాడిగా వచ్చి, మంచివాడిగానే ఆ వూరినించి వెళ్ళి పోయాను. ఆ తర్వాత ప్రమీలని చూడాలనిపించినా ఆ వూరికి రాలేక పోయాను.

పదిహేనేళ్ళ తర్వాత ఇదే నేను ఆ వూరికి రావటం. ప్రమీల ఎక్కడ వుందో! ఏం చేస్తుందో! కొడుకు పుట్టాడో, కూతురు పుట్టిందో! అయినా ప్రమీల వూళ్ళో వాళ్ళకు ఏమని చెప్పిందో! బహుశా ఆమె నాపేరు చెప్పకపోయి వుండాలి. చెప్పివుంటే కరణంగారు నన్ను తమ ఇంటిగడప తొక్కనిచ్చే వారే కాదు. అయితే ప్రమీల ఎవరి పేరు చెప్పి వుండాలి? ఈ ఆలోచనలతో ఎప్పుడు నిదరపట్టిందో తెలియదు.

నేను నిద్ర లేచేసరికే కరణం గారింట్లో అందరూ లేచినట్టున్నారు. పనిమనిషి వాకిలి ఊడుస్తోంది. నేను యథాలాపంగా అటు చూసి ఉలిక్కిపడ్డాను. ఆ మనిషి ప్రమీల కాదు. ప్రమీలకైతే నా అంచనా ప్రకారం అప్పుడు ముప్పై అయి దేళ్ళుండాలి. కాని వాకిలి వూడు స్తున్న పిల్లకు పద్నాలుగూ, పదిహే నేళ్ళుంటాయి. నల్లగా వుంది. కొంచెం లావుగా, గుండ్రంగా వుంది, సరిగ్గా ప్రమీలది అదే ఆకారం. అవే కళ్ళు. అదే గడ్డం. ఆ బుగ్గలే.

నేను తనకేసి సూటిగా, ఆశ్చ ర్యంగా చూడటంతో ఆ అమ్మాయి కూడా నాకేసి తదేకంగా చూడసా గింది. నేను రెండడుగులు వేసి ఆ అమ్మాయి దగ్గిరకు వెళ్ళాను. నాకేసి అదోలా చూసింది.

"నీ పేరేమిటి?" అడిగాను.

"జానకి" అంది మెల్లిగా.

"మీ అమ్మ పేరు?"

మాట్లాడలేదు.

"ఫర్వాలేదు. చెప్పు"

"ప్రమీల"

ఉలిక్కిపడ్డాను. నేను వూహించినంతా జరిగింది. ఈ అమ్మాయి ప్రమీల కూతురా?

"మీ అమ్మ ఎక్కడుంది?"

"లేదు. చచ్చిపోయింది"

అదిరిపడ్డాను.

"ఎన్నాళ్ళయింది?"

"నేను పుట్టగానే పోయిందట"

అయితే ప్రమీల నేను ఆ వూరు వదిలిన పదినెల్లకే పోయిందా?? మరైతే ఈ అమ్మాయి....జానకి.. నా కూతురే....జానకి నా కూతురని తెలియగానే ఆ అమ్మాయి మీద అంతులేని ప్రేమ. వాత్సల్యం పుట్టుకొచ్చాయి.

ఒక్కసారిగా ఆమెను వాత్సల్యంతో దగ్గరకు లాక్కోవాలనిపించింది. "అమ్మా! నేను, నీకు అన్యాయం చేసిపోయిన నాన్నను" అనాలనిపించింది.

నే నదే పనిగా ఆమె వంక చూస్తూ వుండేసరికి, ఆమె తల వొంచుకుంది. నేను వాత్సల్యం పట్టలేకపోయాను. అమాంతం ఆమె తలపై చేయివేసి ఆప్యాయంగా నిమిరాను. అంతే!

"ఒసేవ్ జానకి ముండ!" అన్న పెద్ద కేక వినిపించింది. కరణంగారి భార్య కంఠం. "దిక్కులేని పుట్టక పుట్టావని యింట్లో పెట్టుకున్నాను. ఊరికి భార్యవి కమ్మని కాదే దౌర్భాగ్యపుదానా! అయినా నీ పుట్టుక ఎటువంటిది? నీ వయస్సేమిటి - అతగాడి వయస్సేమిటి? ఛీ!ఛీ!"

నేను అదిరిపడి వెనక్కి చూశాను.

కరణంగారు, భార్య వెనక నిలబడి వున్నారు. ఆయన నోట్లో పందుంపుల్ల వుంది. ఉమ్మి వేస్తూ నావంక చూసి, "ఇదిగో మాధవరావు! నిన్ను పెద్దమనిషి అనుకున్నానోయ్. దానికి సిగ్గు లేదు. రోజుకో మగాడివంక అదలాగే చూస్తూ వుంటుంది. ఇప్పటికి మూడువందలసార్లు పట్టుకున్నాం. ఈ వయస్సులో నీకిటువంటి బుద్ధులుంటాయని ఊహించలేకపోయానోయ్. వెళ్లిపో. మర్యాదగా వెళ్ళిపో!" అన్నారాయన.

ప్రవాహంలో కనిపించే వేగం నీటిది ఎన్నడూ కాదు. కేవలం ప్రవాహానిదే! తప్పు కరణంగారిదీ కాదు, ఆయన భార్యదీ కాదు. ఆనాడు ప్రమీలకు నేను చేసిన ఘోరం యీ నాడు పడగలు విప్పి బుసలు కొడుతోంది. అవమానంతో రాలిపోయిన నా తల యిప్పటికీ ఆ ఊళ్ళో కరణంగారి వీథి గుమ్మాన వ్రేలాడుతునే వుంది. *